క్లుప్తంగా

పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్

చంద్రాల(మైలవరం): మండలంలోని చంద్రాల గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎకో క్లబ్ మిషన్ డే కార్యక్రమంలో భాగంగా పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరద శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పాఠశాల ప్రాంగణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టామన్నారు. పాఠశాల ప్రాంగణంలో విత్తనాలు, మొక్కలు నాటే కార్యక్రమం కూడా నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయులు పాల్గొని పనులను పర్యవేక్షించారు.

జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంకు అభినందన



గానుగపాడు (తిరువూరురూరల్): గత మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆదిలక్ష్మిని డెమొక్రటిక్ పీఆర్టీయూ నాయకులు శుక్రవారం అభినందించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను, స్థానిక ఉపాధ్యాయ సంఘ నాయకులు శాలువాలతో ఆమెను సత్కరించారు. అన్ని పాఠశాలలూ గానుగపాడు హెచ్ఎంను ఆదర్శంగా తీసుకుని రానున్న మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని శ్రీను కోరారు.

మత్తు పదార్థాలను దరి చేరనీయొద్దు

తిరువూరు: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ సూచించారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన సదస్సు తిరువూరు పోలీసులు నిర్వహించారు. విద్యార్థులే లక్ష్యంగా అసాంఘిక శక్తులు మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నాయని, విద్యా సంస్థలనే వీటికి కేంద్రంగా చేసుకుంటున్నారని సీఐ పేర్కొన్నారు. మోసగాళ్ల బారిన పడకుండా విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, గంజాయి, హెరాయిన్, డ్రగ్స్ జోలికి పోకుండా చదువుపై శ్రద్ధ చూపాలని సీఐ సూచించారు. ఎస్ఐ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జామెంట్రీ బాక్సుల పంపిణీ

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): సమాజ శ్రేయస్సే వ్యక్తిగత శ్రేయస్సని శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవసేవ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పేద విద్యార్థులకు 360 జామెంట్రీ బాక్సులను సమితి ప్రతినిధులు అందజేశారు. శ్రీభగవాన్ బోధనల ప్రకారం సమాజానికి ఉపయోగపడే వివిధ రకాల సేవలు అందజేస్తున్నామన్నారు. జామెంట్రీ బాక్సులు తీసుకున్న విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్.కమలాకరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు స్వరూపరాణికి సన్మానం



ఏ.కొండూరు: మండలంలోని రామచంద్రాపురం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రం సబ్జెక్టు ఉపాధ్యాయురాలు బి.స్వరూపరాణి ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించి గణితశాస్త్రంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించటానికి కృషి చేసి ప్రతిభ కనబరిచినందుకు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయురాలు స్వరూపరాణికి విజయవాడలో పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి, డీఈవో సుబ్బారావు శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించి అభినందించారు.

ధాన్యం బకాయిలు విడుదల చేయాలి

చాట్రాయి: రబీలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మిన రైతులు బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలోని పోలవరం సొసైటీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సుమారు 37 మంది రైతులు ధాన్యం విక్రయించారు. సుమారు రూ.40 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది. రైతులు ఆశతో ఎదురు చూస్తున్నా నేటి వరకు బకాయిలు విడుదల చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు విడుదల చేస్తే ఖరీఫ్‌లో వ్యవసాయ పనులకు దోహదపడతాయని రైతులు కోరుతున్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

తిరువూరు: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని విస్సన్నపేట మండలంలో నాటుసారా విక్రయిస్తున్న అంగోతు చాంది అనే మహిళను శుక్రవారం ఎస్ఈబీ అధికారులు అరెస్టు చేశారు. విస్సన్నపేట మండలం నరసాపురం వద్ద రెండు లీటర్ల సారాతో సహా ఆమెను అదుపులోకి తీసుకుని తహసీల్దారు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీడీపీవో ఎస్వై నూరాని



గంపలగూడెం కేజీబీవీలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు సీడీపీవో నూరాని

నూజివీడు: మహిళల, బాలికల చట్టాల గురించి విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరమని ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు సీడీపీవో ఎస్వై నూరాని అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లోనూ, మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వంద రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో నూరాని మాట్లాడుతూ ప్రతి బాలిక జీవితంలో 13 నుంచి 19 సంవత్సరాల వయస్సు వరకు ఎంతో ముఖ్యమైన దశని, ఈ దశలో అట్రాక్షన్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని లక్ష్య సాధనకు పట్టుదలతో శ్రమించాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు నిండే వరకు, మగపిల్లలు 21 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేసుకోవద్దన్నారు. ఆడ పిల్లలు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని నూరాని సూచించారు. ఏలూరులోని వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి సీహెచ్ నిర్మల మాట్లాడుతూ కిశోర బాలికలు సమాజం గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. కొత్తవారిని ఎవరిని నమ్మొద్దని, సోషల్ మీడియాలో పరిచయాలు చేసుకోవద్దని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లలో ఎక్కౌంట్‌లను ప్రారంభించొద్దన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నాగేశ్వరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, సూపర్‌వైజర్ ధనలక్ష్మి, ఎంఎస్‌కేలు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం మెండు

గంపలగూడెం: అనునిత్య క్రమం తప్పకుండా యోగా పాటించటం ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం పొందుతారని ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్టు సీడీపీఓ సత్యవతి తెలిపారు. 'బేటీ భచావ్–బేటీ పడావ్' కార్యక్రమంలో భాగంగా గంపలగూడెం మండలం తోటమూల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలికలకు యోగాలో ఒక్కరోజు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ యోగా వల్ల విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారని వివరించారు.

అనంతరం జిల్లా బాలల సంరక్షణ యూనిట్ (డీసీపీఓ)కు చెందిన జీవన్‌కుమార్ విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ప్రకృతి, పర్యావరణం గురించి వివరించారు. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్లు మునిలక్ష్మి, రేవతి, పీ వెంకటకుమారి, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రై డే పనుల పరిశీలన



తిరువూరు పట్టణంలో డ్రై డే పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ లోవరాజు



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ మోర్ల లక్ష్మి

తిరువూరు: వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు సూచించారు. పట్టణంలో శుక్రవారం వైద్యారోగ్య శాఖ, నగర పంచాయతీ సంయుక్తంగా డ్రై డే నిర్వహించారు. వార్డుల్లో పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించిన కమిషనర్ నివాసగృహాల నడుమ పందుల పెంపకం, మురుగునీరు నిల్వ ఉండటంపై తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. దోమల నిర్మూలనకు నివాసగృహాల పరిసరాల్లో రోజుల తరబడి నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ఏ.కొండూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామని మండల ప్రాథమిక వైద్యాధికారి వి.స్వాతి పేర్కొన్నారు. మండలంలోని పాత కొండూరు గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యాధికారి ఎం.సుహాసిని ఆదేశాల మేరకు పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎం. బాలమురళీకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని చీమలపాడు గ్రామంలో సర్పంచ్ మోర్ల లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. నిల్వ ఉన్న మురుగునీటిపై బ్లీచింగ్ పౌండర్ చల్లించి దోమల మందు ఫాగింగ్ చేయించారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించి సరఫరా చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

విస్సన్నపేట: మండలంలోని తెల్లదేవరపల్లి ఆరోగ్యకేంద్రం పరిధిలో అన్ని గ్రామాల్లో దోమల నివారణ చర్యలు, లార్వా నిర్మూలన, జ్వర పీడుతుల సర్వే కార్యక్రమం శుక్రవారం నిర్వహించినట్లు మండల వైద్యాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. కొండపర్వ గ్రామంలో స్పెషల్ డ్రైవ్ సందర్భంగా ఏడు టీములు ఏర్పాటు చేసి 242 గృహాలను సర్వే నిర్వహించి జ్వరపీడుతులను గుర్తించటంతో పాటు లార్వా నిర్మూలన నిర్వహించారు. ఎంపీడీఓ జి.విజయకుమారి ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులకు వివరించారు. పెద్దవరంలో దోమల నిర్మూలనకు ఎబేట్ మందును సర్పంచి గద్దె అప్పారావు ఆధ్వర్యంలో పిచికారీ చేయించారు.

చాట్రాయి: మండలంలోని చనుబండ, చిత్తపూరు గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు వేగవంతంగా చేపట్టారు. ఈ సందర్భంగా అన్ని కాలనీల్లో బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు విస్సంపల్లి జ్యోతి, తిరువీధి రమేష్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాయల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డిపల్లి(విస్సన్నపేట): వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ సుధాకర్ అన్నారు. మండలంలోని వేమిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో కలసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రూపొందించిన సీజనల్ వ్యాధులకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. రవికుమార్, జనవిజ్ఞానవేదిక మండల అధ్యక్షుడు ఎంజీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరపతి సంఘాల సీఈఓలకు సన్మానం

8 సొసైటీల్లో నూరుశాతం రుణాల రికవరీ



సన్మానం అందుకున్న సీఈఓలతో ఛీఫ్‌మేనేజర్

గంపలగూడెం: మండల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో నూరు శాతం రుణాల రికవరీ సాధించిన 8 పీఏసీఎస్‌ల సీఈఓలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ ఆవరణలో నిర్వహించిన కారక్రమంలో ఆయా సొసైటీల సీఈఓలకు బ్యాంక్ చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా చీఫ్ మేనేజర్ మాట్లాడుతూ మండలంలో 12 పీఏసీఎస్‌లకుగాను 8 సంఘాల్లో నూరుశాతం మెంబర్ స్థాయి రుణాలు రికవరీ కావడం అభినందనీయం అన్నారు. సీఈఓలు షేక్ సుభానీ(కొణిజెర్ల), వెంకటనర్సయ్య (ఊటుకూరు), ఏ శ్రీనివాసరావు(గంపలగూడెం), నామా నరశింహారావు (పెనుగొలను), షేక్ ఉస్మాన్(కనుమూరు), పీ మోహన్‌రావు, (తునికిపాడు), శ్రీనివాసరావు (గుళ్లపూడి), ఎం.వెంకటేశ్వర్లు,(రాజవరం) సన్మానం పొందారు. బ్యాంక్ సూపర్‌వైజర్లు మల్లాది యేసోబు, ఏ కొండయ్య, రూట్ ఇన్‌చార్జి స్టాలిన్‌బాబు ఆయా సొసైటీ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను ఎలిమెంటరీ పాఠశాలలో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ పోరాటంలో అసువులుభాసిన అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సేవా కమిటీ సభ్యులు నారాయణరావు మాట్లాడుతూ 1999 జూలై నెలలో జరిగిన కార్గిల్ పోరాటంలో పాకిస్తాన్‌పై భారత్ విజయం సాధించిందన్నారు. పోరాటంలో మృతిచెందిన అమరవీరులైన జవాన్‌లకు సంతాపం వ్యక్త పరుస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, షిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

ఆగిరిపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఎంపీడీవో శామ్యూల్ అన్నారు. శుక్రవారం ఆగిరిపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డీపీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలలకు, విద్యార్థులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో శామ్యూల్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డీపీఆర్‌టీయూ మొక్కలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్, ఏవో అబ్దుల్ సలాం, జెడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం పుష్పలత, డీపీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి వంశీ వశిష్ట, పామర్తి నరసయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్ నిర్వహణ తీరు పరిశీలన

లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలోని లక్ష్మీపురం ఎంపీయూపీ పాఠశాలను శుక్రవారం ఎంఈవో శ్యాంసుందరరావు తనిఖీ చేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమ నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు సులభంగా బోధనకు ఉపకరించే టీఎల్ఎంలను రూపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు స్కిల్ డేలో భాగంగా మట్టి, తాటాకులు, ఆకులు, పువ్వులతో చేసిన వివిధ నమూనాలను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచండి

కాచవరం(ఇబ్రహీంపట్నం): పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా ఉర్దూ పాఠశాలల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సాదతుల్లా అన్నారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా కాచవరం ఎంపీపీ పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి విద్యలో సామర్థ్యం పరిశీలించారు. దాతలను పాఠశాలకు ఆహ్వానించి సహపంక్తి భోజనం నిర్వహించాలని సూచించారు. హెచ్ఎం నాగమల్లేశ్వరి, హిందీ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌పాషా, ఎస్ఎంసీ చైర్మన్ నూర్జహాన్ పాల్గొన్నారు. దొనబండ (కాచవరం) ఎంపీపీ పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఉన్నత చదువులతో కలిగే ప్రయోజనాలు వివరించారు. హెచ్ఎం అమర్‌నాయక్, ఉపాధ్యాయులు శిరీషా, రాజేష్ పాల్గొన్నారు.

డీఈవో కోర్సులో ఉచిత శిక్షణ

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తోందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శుక్రవారం తెలిపారు. ఎస్ఎస్‌సీ, టెన్ ప్లస్–2, డిగ్రీ ఆపైన విద్యార్హత కలిగిన అభ్యర్థులకు ప్రత్యేకంగా మూడు నెలలు డొమెస్టిక్ బయోమెట్రిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 31లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పీ.నరేష్‌కుమార్ తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు.

నేడు ఆధార్ శిబిరాల ఏర్పాటు

నూజివీడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 27న ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరాలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ఎంఎన్‌పాలెం, సీతారామపురం, పల్లెర్లమూడి, తుక్కులూరు, జంగంగూడెం సచివాలయాల్లో ఆధార్ శిబిరాలను నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరాల్లో ఆధార్‌లో అడ్రస్ మార్పు, బయోమెట్రిక్ అప్‌డేట్, పేరులో సవరణలు, చిన్న పిల్లలకు నూతన ఆధార్, తదితర సేవలను అందిస్తారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కంకర క్వారీల్లో కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండపల్లిలో కార్మికులతో కలసి శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు పీఎఫ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పనిప్రదేశాల్లో పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే గుర్తింపు కార్డులు ఇవ్వకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా



ముసునూరు ఎస్‌బీఐ మేనేజర్‌కు కౌలు రైతుల జాబితా అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ముసునూరు: జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులకు పంట రుణాలు అందజేయాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా బ్యాంకర్లను కోరారు. ముసునూరులో కౌలు రైతుల రుణాల మంజూరుపై అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్‌బీఐ, కో–ఆపరేటివ్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌ల మేనేజర్లకు స్థానిక రైతులు, అధికారులతో కలిసి, మండలంలోని కౌలు రైతుల జాబితాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 75,000 కౌలు కార్డులు జారీ లక్ష్యం కాగా, ఇప్పటికే 45,000 కార్డులు పంపిణీ చేశామన్నారు. ఖరీఫ్ సీజన్ చివరికి మరో 45,000 కార్డుల మంజూరు లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కౌలు రైతులకు రుణాలు మంజూరు చేసి సహకరించాలని బ్యాంకర్లను ఆయన కోరారు. నూజివీడు ఏడీఏ విద్యాసాగర్, తహసీల్దార్ జవహర్‌బాజి, ఎంఏవో సందిపాము మధుమోహన్, వీఆర్వో మస్తాన్‌రావు, ఏఈవో రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి

నూజివీడు: మండలంలోని కౌలు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం కింద పంట రుణాలు మంజూరు చేయాలని వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి బ్యాంకర్లను కోరారు. మండలంలోని గొల్లపల్లి, పల్లెర్లమూడి, మర్రిబంధం, యనమదల, నూజివీడులోని బ్యాంకర్లను కలిసి వారికి కౌలు రైతు గుర్తింపు కార్డులు జారీ చేసిన జాబితాలను అందజేశారు. కౌలు రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారేనని వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా ఉండాలంటే వారికి బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. నూజివీడు మండలంలో 2,677 మందికి ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించగా ఇప్పటి వరకు రెవెన్యూ శాఖ ద్వారా 1,290 కార్డులు మంజూరయ్యాయన్నారు. కౌలు రైతు రైతుసేవా కేంద్రంలో ఈ కార్డులు పొంది పంట నమోదు, క్రాప్ ఇన్సూరెన్స్‌లను పొందేందుకు నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధశాఖల్లో ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని రైతులను కోరారు.

వేతనాల కోసం పారిశుద్ధ్య కార్మికుల నిరసన



ఊటుకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఊటుకూరు(గంపలగూడెం): దీర్ఘకాలంగా బకాయి ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ మండలంలోని ఊటుకూరులో పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ముందు ప్లకార్డులను చేతబూని ఆందోళన చేశారు. గడచిన 20 నెలలుగా తమకు వేతనాలు చెల్లించటం లేదని వారు ఈ సందర్భంగా తెలిపారు. బకాయిలను ఇవ్వక పోగా తమను విధుల నుంచి తొలగించారంటూ ఆందోళన చేశారు. బకాయిలు చెల్లించి, తిరిగి తమను విధుల్లో చేర్చుకోవాలన్న డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని పంచాయతీ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్ కిరణ్‌కు అందజేశారు.

కోలాహలంగా సారె సమర్పణ



కొణిజెర్లలో సారెతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

కొణిజెర్ల(గంపలగూడెం): గంపలగూడెం మండలం కొణిజెర్ల నాగ కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా మహిళలు కోలాహలంగా అమ్మవారికి శుక్రవారం సారె సమర్పించారు. ముందుగా 150 మంది మహిళలు నూతన వస్త్రాలు, పసుపు కుంకుమ, గాజులు, వివిధ రకాల వంటకాలతో కూడిన సారె సామగ్రిని చేతబూని అమ్మవారి ప్రతిమతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. ఆలయ అర్చకులు లక్ష్మీనారాయణాచార్యులు ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

విస్సన్నపేట: స్థానిక ద్వారకానగర్‌లో ఉన్న కనకదుర్గా అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం ఆర్యవైశ్య మహిళలు, భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవారికి కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పాఠ్యపుస్తకాలలో క్యూఆర్‌కోడ్‌తో ప్రయోజనాలెన్నో

రెడ్డిగూడెం: పాఠ్య పుస్తకాలలో క్యూఆర్‌కోడ్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎంఈఓ పి.రమేష్ అన్నారు. మండలంలోని నాగులూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో ఉండే క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయడం ద్వారా పాఠ్యాంశ పూర్తి పరిజ్ఞానాన్ని అనుబంధంగా ఉన్నటువంటి ప్రాజెక్టు వర్క్‌ను, సబ్జెక్టు నిపుణులు అప్లోడ్ చేసిన ఎక్స్‌పర్ట్ వీడియోస్‌ను చూసి మరింత పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. ఉపాధ్యాయులు జి.అనుగ్రహప్రసాద్, పి.నాగమణి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన 'లయన్స్' సభ్యులు

తిరువూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం తిరువూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఇంటింటా మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్యక్రమానికి ముఖ్యఅతిథి తిరువూరు సెక్టార్–1 ఎస్ఐ సత్యనారాయణ కోరారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, వాకర్స్ క్లబ్, లయన్స్‌క్లబ్బుల సభ్యులు స్టేడియం ఆవరణలో మొక్కలు నాటారు.

కౌలు రైతుల ధర్నా

ఏ.కొండూరు: కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పి.ఆనందరావు మాట్లాడుతూ భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు సాగుదారులను గుర్తించి అర్హులైన కౌలు రైతులకు కౌలు రైతు కార్డులు ఇవ్వాలన్నారు. పంట రుణాలు, పంట నష్ట పరిహారం, పంటల బీమా, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు వర్తింపజేయాలన్నారు. ఈ క్రాప్‌లో కౌలు రైతుల పేర్లు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. నాయకులు జట్టి వెంకటేశ్వరరావు, ఏ అంబిరెడ్డి, పి. సుందరయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ సుశీలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ హిస్టరీలో 55 శాతం మార్కులు సాధించిన వారు ఈ పోస్టుకు అర్హులని, నెట్, స్లెట్ ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీలోపు దరఖాస్తులను తమ కళాశాలలో అన్ని ధ్రువీకరణ పత్రాలతో సమర్పించాలని, 3న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలియజేశారు.